విస్తరణ సరే.. వంతెనలు?

- చిప్పలపల్లి టు బండలింగంపల్లి రోడ్డు దుస్థితి
- కిలోమీటరు మేర మిగిలిన విస్తరణ పనులు
- ప్రమాదకరంగా నిజాంనాటి కెనాల్ వంతెన

ముస్తాబాద్: ఏదైనా పనులు చేపట్టేప్పుడు.. వంతెనలు.. రహదారి పొడవు ఎంత.? ఎంత ఖర్చువుతుందో ఇంజినీరింగ్ అధికారులు చూసుకుని మరీ అంచనాలు తయారు చేస్తారు. కాని ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి వరకు ఉన్న సింగిల్ లేన్ రోడ్డు విస్తరణ పనులు అంచనా తప్పాయో లేక, ధరలు పెరిగాయో తెలియదు కానీ అసంపూర్తి పనులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం చిప్పలపల్లి మెయిన్ రోడ్డు నుంచి బండలింగంపల్లి వరకు 13 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారు.


ప్రమాదకర వంతెనపై వాహనాల తంటాలు


విస్తరణకు నోచుకోని రహదారి

విస్తరణ మరిచారు

చిప్పలపల్లి నుంచి గోపాల్‌పల్లె తండా రోడ్డు వరకు ఉన్న కిలో మీటరున్నర రహదారిని వదిలేశారు. తండా రోడ్డు క్రాసింగ్ నుంచి బండలింగంపల్లి వరకు మాత్రమే పనులు పూర్తి చేశారు. దీంతో కిలోమీటరున్నర మేర ఉన్న సింగిల్ లేన్ రహదారి కనీసం మెయింటెనెన్స్‌కు కూడా నోచుకోవడం లేదు. గుంతలు పడి, వాహనాలు నడిచే స్థితిలో లేదు. ఈ దారిలో ఎల్లారెడ్డిపేట మండలంతోపాటు కొండాపూర్, బండలింగంపల్లి, గోపాల్‌పల్లె, మల్లారెడ్డిపేట, సింగారం గ్రామాల ప్రజలు, ఇటు ముస్తాబాద్ మండల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. మిగిలిన విస్తరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఏడాది క్రితం సింగిల్ లేన్ రహదారిపై ప్రమాదం జరిగి ఒకరు ప్రాణాలు కోల్పోయారని చిప్పలపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కెనాల్‌పై వంతెనకు మోక్షం ఎప్పుడో?

చిప్పలపల్లి నుంచి గోపాల్‌పల్లె వెళ్లే దారిలో నిజాం కాలంలో మానేరు కెనాల్‌పై నిర్మించిన వంతెన ఉంది. యాభై ఏళ్ల క్రితం కేవలం మూడు మీటర్ల వెడల్పుతో నిర్మించిన ఈ వంతెన అత్యంత ప్రమాదరకంగా వుంది. ప్రస్తుతం ఏటా కెనాల్ నిండుగా ప్రవహిస్తోంది. వచ్చివెళ్లే వాహనాలు ఈ కెనాల్ వద్ద నెమ్మదిగా వెళ్లకుంటే భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో వాహనాలు ఇక్కడ ప్రమాదాలకు గురయ్యాయి. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. రోడ్డు విస్తరణ సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఎందుకనో ఈ వంతెనను విస్మరించారు. అంచనాలను తయారు చేసేటప్పుడే పరిగణలోకి తీసుకోకపోవడం వల్లే నేడు ఈ దుస్థితికి కారణమని చెబుతున్నారు. వారు చేసిన అంచనాలకు ఇప్పటికి నిధులు రాలేదు.

ఇరిగేషన్ శాఖ బాధ్యతతో..

మానేరు ప్రాజెక్టు కెనాల్‌పై గోపాల్‌పల్లె వద్ద వున్న ప్రమాదకర వంతెనను పూర్తిగా తొలగించి, కొత్త వంతెన నిర్మించాలన్న రెండు మండలాల ప్రజల కోరికను నీటి పారుదల శాఖ తీసుకుంది. ఇక్కడ రూ.20 లక్షల వ్యయంతో వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు మంత్రి కేటీఆర్‌కు గోపాల్‌పల్లె వాసులు వినతిపత్రం అందించారు. నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలోనే వంతెనను నిర్మించాలని కోరారు. త్వరలోనే ప్రతిపాదనలకు నిధులు వస్తాయనే ఎదురుచూస్తున్నారు.

కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం



విస్తరణలో మిగిలిపోయిన రోడ్డు పనుల తోపాటు, మానేరు కెనాల్‌పై వంతెన నిర్మించాలని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. కెనాల్‌పై వంతెన చాలా ఇరుకుగా వుంది. త్వరలోనే నిధులు వస్తాయని ఆశిస్తున్నాం. ఇదీ మూడు మండలాల ప్రజల రాకపోకలకు అనువుగా వుంటుంది.

– జగ్గని నరేశ్, సర్పంచ్, గోపాల్‌పల్లె

ప్రమాదాలు జరుగుతున్నాయి



రాత్రివేళల్లో ఈ రూట్‌లో ప్రయాణించే వారు డబుల్ రోడ్డు కదా అని వేగంగా ప్రయాణిస్తున్నారు. మానేరు కెనాల్ వద్దకు రాగానే ప్రమాదాలకు గురవుతున్నారు. నేను పుట్టక ముందు ఉన్న బ్రిడ్జి ఇదీ. చిన్న సందులా ఉంటుంది. భవిష్యత్‌లో ప్రమాదాలు నివారించేందుకైనా కొత్త బ్రిడ్జి కట్టాలి.

– మల్లారపు అజయ్, గోపాల్‌పల్లె

ప్రతిపాదనలు పంపించాం



మొదట రోడ్డు విస్తరణ పనులు జరిగినప్పుడు ఆర్‌అండ్‌బీ వారే వంతెన కడుతారని భావించాం. అలా జరగలేదు. స్థానిక రైతుల కోరిక మేరకు వంతెన నిర్మాణం కోసం రూ.20 లక్షల అంచనాలను పంపించాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– వంశీ కృష్ణ, ఏఈ, నీటిపారుదలశాఖ

క్లుప్తంగా

ఈవీఎం వీవీ ప్యాట్లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముస్తాబాద్/కోనరావుపేట: భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండలం పోతుగల్, కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలో ఈవీఎం, వీవీ ప్యాట్ల నమోదుపై గురువారం అవగాహన కల్పించారు. ఈవీఎంలో గుర్తుల విధానం, ఈవీఎం ద్వారా నమోదైన ఓటు, ఎవరికి వెళ్లిందో చూపే వీవీ ప్యాట్లను ప్రదర్శించారు. అలాగే ఎలక్ట్రానిక్ ఓటు మిషన్ పనితీరును ప్రజలకు వివరించారు. ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరు ఓటు వేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ముస్తాబాద్ ఆర్ఐ శ్యాం, బీఎల్‌వో కోటగళ్ల శారద, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేరీ మట్టి.. మేరీ దేశ్


మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడఅర్బన్: అజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో గురువారం మేరీ మట్టి– మేరీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత జాతి సమగ్ర ఉన్నతికి కృషి చేసిన ఎందరో మహానుభావుల త్యాగాలను ఎప్పుడు సదా జ్ఞప్తిలో ఉంచుకోవాలన్నారు. వారు చూపిన బాటలో నడవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తిరుకోవెల శ్రీనివాస్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అఫ్సారీ ఉస్మానీ, మల్లారెడ్డి, రాజేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు


ఉత్సవాల్లో ఆది శ్రీనివాస్, నాయకులు

కోనరావుపేట/వీర్నపల్లి: మండలంలోని కమ్మరిపేటతండా (వట్టిమల్ల), వీర్నపల్లి మండలంలోని బావుసింగ్‌నాయక్ తండా పరిధిలోని బానోత్ తండా జగదంబ గుడి వద్ద తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. యువతులు తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించిన గోధుమ నారును సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్‌నరేశ్ వేడుకల్లో పాల్గొన్నారు.

సమాచారం

26న మినీ జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 26న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థుల తమ ఒరిజినల్ విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ప్రగతినగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి ప్రతి నెల రూ.20 వేల వేతనం అందజేస్తామన్నారు. వివరాలకు 99633 57250 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్, అర్బన్ మండలాల్లో ఉన్న ప్రభుత్వ బాలికల పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బన్నాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో రూరల్ మండలంలోని హన్మాజిపేట జెడ్పీహెచ్ఎస్‌లో, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో అర్బన్ మండలంలోని నాంపల్లి నిర్మల హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే బాలికలు 14 ఏళ్లలోపు 8వ తరగతి వరకు చదువుకుని 2010 జనవరి 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అదే విధంగా 17 ఏళ్ల బాలబాలికలు 9, 10 తరగతులు 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు వేములవాడ అర్బన్ మండలం స్కూల్ గేమ్స్ కన్వీనర్ హమీద్, వేములవాడ రూరల్ మండల స్కూల్ గేమ్స్ కన్వీనర్ నాంపెల్లి శ్రీనివాస్ 91339 47242, 94932 07017 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గోశాలకు కోడెలు



వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని కోడెలను వరంగల్ జిల్లాలోని శ్రీబాలాజీ గోశాలకు 20 కోడెలను అందజేశారు. శ్రీనివాస్, నరసింహామూర్తి, శ్యామ్, శంకర్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ ఒకటో అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు, తల్లులు 15 రోజులుగా రావడం లేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్లయ్య, ఏసీడీపీవో సుచరితతో కలిసి గురువారం సందర్శించారు. కొంతమంది లబ్ధిదారులకు పౌష్టికాహారం, కోడిగుడ్లు పంపిణీ చేశామని, పిల్లల బరువు తీశామన్నారు. సూపర్‌వైజర్లు నిర్మల, గంగాలక్ష్మి, మమత పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసగించిన వారికి జైలు

సిరిసిల్లక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి లక్షల్లో టోకరా వేసిన ప్రబుద్ధులకు జైలుతోపాటు నగదు జరిమానా విధిస్తూ గురువారం సిరిసిల్ల ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హిమబిందు తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడకు చెందిన బోయిని సత్యనారాయణ, బోయిని శ్రీధర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని సిరిసిల్లలోని అనంతనగర్‌కు చెందిన కట్ల భూమయ్య కొడుకులను, మరికొందరి నుంచి రూ.12.50 లక్షలు వసూలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేయగా ఎస్సై మల్లయ్య చార్జిషీట్ దాఖలు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్.సందీప్ ప్రాసిక్యూషన్ పక్షాన వాదనలు వినిపించారు. డబ్బులు వసూలు చేసిన సత్యనారాయణ, శ్రీధర్‌లకు రెండేళ్ల జైలు, రూ.8 వేల జరిమానా విధిస్తూ జడ్జి హిమబిందు తీర్పునిచ్చారు.

వృద్ధుడి ఆత్మహత్య



వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అనుపురం గ్రామానికి చెందిన ఎర్రం సత్తయ్య(65) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సత్తయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మనస్తాపానికి గురై, గురువారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దళారులు రాజ్యమేలుతున్నారు

- కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళారులు రాజ్యమేలుతున్నారని, మాఫియాను అరికట్టి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కిష్టంపల్లిలో గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ అండచూసుకోని నియోజకవర్గంలో భూదందాలు, అక్రమ ఇసుక రవాణా, మైనింగ్ రంగాలలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడం విడ్డూరమన్నారు. పేద ప్రజల బతుకులు మారడానికి ఈ ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మండలానికి ఐదుగురి చొప్పున బడానాయకులు బాగుపడ్డారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తాను మద్యం, డబ్బులు పంచనని మంత్రి కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. తాను ఓడిపోతే పథకాలు ఏమైతాయని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం ఓడిపోతే వచ్చే ప్రభుత్వం ఇంకా మెరుగైన పథకాలు అమలు చేస్తుందన్నారు. స్థానికుడిని అయినా తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. పలువురు కేకే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు ఎస్‌కే గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, అనవేణి రవి, రఫిక్, మధు, దేవయ్య, బాబు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, సంతోష్‌గౌడ్, తిరుపతిగౌడ్, కిషన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


కిష్టంపల్లిలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

అభివృద్ధిలో భాగస్వాములు కండి

- బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- ఘనంగా సన్మానించిన పార్టీ శ్రేణులు

వేములవాడ: వేములవాడ అభివృద్ధిలో తామంతా భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కలసికట్టుగా పోరాటం చేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. పట్టణంలోని మహాదేవ్ బంకేట్ హాల్‌లో వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, తామంతా ఒకే కుటుంబంగా ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జెడ్పీటీసీ వాణి, ఏఎంసీ చైర్మన్ ప్రభాకర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ హన్మాండ్లు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం కార్యదర్శి సంతోష్, వేములవాడ రూరల్ మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ వెల్మ బాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ

మాదంతా ఒకే గ్రూప్

బీఆర్ఎస్‌లో ఎలాంటి గ్రూపులు లేవని.. మాదంతా ఒకే గ్రూప్ అని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే చాలా మంది తమతో కలసి వచ్చారని, మిగతా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా కలసి వస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఎంతో అభివృద్ధి చేశారని.. అదే ఒరవడిని తాను కొనసాగిస్తానన్నారు. స్థానికంగానే ఉంటూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామంలో వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, వైస్ఎంపీపీ మందాల అబ్రహం, కేడీసీసీ డైరెక్టర్ కిషన్‌రావు, ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు పాల్గొన్నారు.

జయహో చంద్రయాన్

సిరిసిల్లటౌన్/కోనరావుపేట/వీర్నపల్లి/రుద్రంగి/వేములవాడఅర్బన్: చంద్రయాన్–3 విజయవంతంపై విద్యార్థిలోకం హర్షించింది. జిల్లాలోని పలు విద్యా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీలు నిర్వహించారు. ఉత్సవాల్లో డీఈవో రమేశ్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సిరిసిల్ల సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం, కోనరావుపేట మండలం మర్తనపేటలో మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల, వీర్నపల్లి మండలంలోని రంగంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ముస్తాబాద్‌లో శ్రీరాఘవేంద్ర స్కూల్ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. రుద్రంగి జెడ్పీ హైస్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులను ఇస్రో ఆకారంలో కూర్చోబెట్టారు. రాకెట్ నమూనా తయారు చేశారు. అలాగే వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతరిక్ష విజ్ఞానంలో భారతదేశ అద్భుత ప్రగతి గురించి ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ ప్రసంగించారు. చంద్రయాన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.


సిరిసిల్లలో ర్యాలీలో పాల్గొన్న డీఈవో రమేశ్

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం


ఎలుసాని మోహన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన ఎలుసాని మోహన్‌కుమార్‌ను గురువారం గ్రామస్తులు సన్మానించారు. మండలంలోని నారాయణపూర్‌లోని తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి, పూలబొకే అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ఎండపల్లి క్రాంతి, ఎంపీటీసీ మజీద్, గ్రామస్తులు సృజన్, నారాయణ, బాబు, వినయ్, అజయ్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు

తంగళ్లపల్లి: సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నూతనంగా నియామకమైన మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతితో పాటు డైరెక్టర్ సద్ది రోజాను, జెడ్పీటీసీ పూర్మాని మంజుల సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

వేములవాడరూరల్: పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేములవాడలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేష్, జిల్లా బాధ్యులు పి.హన్మాండ్లు, లచ్చన్న, రవీందర్, బానాల మల్లారెడ్డి, జనార్దన్, మండల బాధ్యులు కె.రమేశ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని తంగళ్లపల్లి, తాడూర్, బద్దెనపల్లి, మండెపల్లి, ఓబులాపూర్, జిల్లెల్ల, చిన్నలింగాపూర్, అంకుషాపూర్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వాలు నమోదు చేశారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు కొక్కొండ సత్యనారాయణ జిల్లా కార్యదర్శి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి రాంచంద్రం, ఆర్థిక కార్యదర్శి సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రలో మామిడిపల్లి రైతులు

కోనరావుపేట/తంగళ్లపల్లి: జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్, వ్యవసాయ కళాశాల సిరిసిల్ల ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన రైతులు విజ్ఞానయాత్రకు తరలివెళ్లారు. గ్రామంలోని ఆదర్శ సమాఖ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులను తునికి బొల్లారం, ములుగులో గల ప్రసాద్ సీడ్ ప్రాసెసింగ్, హైడ్రోపోనిక్స్ పార్క్‌కి తీసుకెళ్లారు. డాక్టర్ సత్యనారాయణరెడ్డి కూరగాయలు పెంచే విధానం గురించి రైతులకు వివరించారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కే మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు భవ్యశ్రీ, సతీశ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


సీడ్ కంపెనీలో రైతులు

పార్టీ బలోపేతానికి కృషి

ఎల్లారెడ్డిపేట: గడప గడపకూ బీఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రచార కార్యదర్శి యారపు రాజాబాబు, జిల్లా ఈసీ మెంబర్ తాటిపల్లి అంజయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్, మండల ఇన్‌చార్జి సందీప్, నీరటి భాను, నాయకులు సంజీవ్, కిషన్, నాంపెల్లి, నీలేశ్, ధర్మేందర్, నవీన్, సుభాష్, నరేందర్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీస్‌లో ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్లటౌన్: మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించి, మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఆస్పత్రి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఆయాజ్, కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

కోనరావుపేట: మండలంలోని గ్రామాలకు చెందిన 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు కోరారు. అర్హులైన వారు ఈ నెల 19లోపు ఆయా గ్రామాల్లోని బూత్ లెవెల్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సర్పంచ్ పాశం సరోజన గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన నారాపురం దేవవ్వ, దాసరపు లక్ష్మికి రూ.1,00,116 చొప్పున చెక్కులు అందించారు.

పద్మశాలి శంఖారావం

బోయినపల్లి: హైదరాబాద్‌లో సెప్టెంబర్ 3న నిర్వహించే పద్మశాలీ శంఖారావం సభను విజయవంతం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో మార్కండేయ పద్మశాలీ యువజన సంఘం నాయకులు ఆవిష్కరించారు.

కండ్ల కలక మందులు పంపిణీ

వేములవాడఅర్బన్: బోయినపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల ఆధ్వర్యంలో 520 మంది విద్యార్థులకు కండ్లకలక రాకుండా ఉండేందుకు హోమియోపతి మందులు అందించారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరణ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల జెడ్పీహెచ్ఎస్‌కు దుంద్రపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజిరెడ్డి స్మార్ట్ టీవీ బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్య నారాయణ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామంలో ప్రభుదేవా అనే లబ్ధిదారుడికి రూ.60 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీపీ పడిగెల మానస అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదారి పోచయ్య, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, గ్రామశాఖ అధ్యక్షుడు మంగళపల్లి యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

'రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న మేనేజర్'

ఎల్లారెడ్డిపేట: ఎల్ఐసీ ఇన్సూరెన్స్ చెల్లిస్తేనే పంటరుణం మంజూరు చేస్తామని రైతులను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా తాను డ్రైవింగ్‌లో ఉన్నానని దాటవేశాడు.

బండనకల్ సర్పంచ్ భర్త నారాగౌడ్ మృతి

ముస్తాబాద్: మండలం బండనకల్ సర్పంచ్ గుర్రం వెంకటేశ్వరి భర్త నారాగౌడ్(62) గజ్వేల్‌లోని ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో గురువారం మృతి చెందారు.

హైజెనిక్ కిట్లు అందజేత

సిరిసిల్లటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి హైజెనిక్ కిట్లను పంపిణీ చేశారు.

బీఎస్ఎఫ్‌కు ఎంపికైన విజ్ఞాన్ పూర్వ విద్యార్థి

ఎల్లారెడ్డిపేట: బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించిన మండల కేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్ పూర్వ విద్యార్థి తాడ మల్లికార్జున్‌కు కరస్పాండెంట్ మహమ్మద్ లతీఫ్ సన్మానం చేశారు. హెచ్ఎం శరత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెలిమి పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడఅర్బన్: వేములవాడ జెడ్పీహెచ్ఎస్‌లో చెలిమి పోస్టర్‌ను ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని గురువారం ఆవిష్కరించారు.